వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ జనవరి 11 శనివారం 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 176
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# టికెట్ల ధరల పెంపును పునః సమీక్షించండి



**బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడంలేదంటూనే అదనపు షోల ప్రదర్శనలకు ప్రభుత్వం అంగీకరించడాన్ని శుక్రవారం హైకోర్టు తప్పుపట్టింది.**

**ప్రజారోగ్యం, భద్రత ఏర్పాట్లు చేసేదాకా అదనపు షోలకు అనుమతించొద్దు**

**'గేమ్ ఛేంజర్'పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు**

హైదరాబాద్: బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడంలేదంటూనే అదనపు షోల ప్రదర్శనలకు ప్రభుత్వం అంగీకరించడాన్ని శుక్రవారం హైకోర్టు తప్పుపట్టింది. భవిష్యత్తులో ప్రజారోగ్యం, భద్రతకు సంబంధించిన విషయాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు జరిగేలా చూసేంతవరకు వేకువజామున షోలకు అనుమతించరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'గేమ్ ఛేంజర్' సినిమాకు టికెట్ల ధరల పెంపుపై జారీ చేసిన ఉత్తర్వులను 24 గంటల్లో పునస్సమీక్షించాలని ఆదేశించింది. ఈ సినిమా అదనపు షోలతోపాటు టికెట్ల ధరలను పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో మూడు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై గురువారం విచారించిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి... శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. "బెనిఫిట్ షోలకు అనుమతించబోమన్న ప్రభుత్వం పరోక్షంగా అనుమతిచ్చింది. తెల్లవారుజామున అదనపు ప్రదర్శనలకు ఒప్పుకొందంటే వాటిని బెనిఫిట్ షోలుగానే పరిగణించాల్సి ఉంటుంది. రాత్రి నిద్రించాల్సిన సమయంలో సినిమాలేంటి? అర్ధరాత్రి రెండు గంటలు దాటిన తర్వాత మీ పిల్లలను రోడ్లపై ఇలాగే తిరగనిస్తారా? 16 ఏళ్లు నిండని వారికి అర్ధరాత్రి సినిమాలకు, పబ్‌ల్లోకి అనుమతించరాదని ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఇలాగే నిబంధనలను ఉల్లంఘిస్తే రాత్రి 11 గంటలు దాటిన తర్వాత సినిమా థియేటర్లు, పబ్‌ల మూసివేతకు ఆదేశాలిస్తాం" అని ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి న్యాయమూర్తి హెచ్చరించారు. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... నిబంధనల ప్రకారం రోజుకు నాలుగు ప్రదర్శనలకే అనుమతించాల్సి ఉందన్నారు.



# అభివృద్ధి,సంక్షేమం మాకు రెండు కళ్లు

- లబ్ధిదారుల వివరాల వెల్లడికి గ్రామ సభలు
- 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'
- సాగుయోగ్యమైన భూమికి మాత్రమే రైతుభరోసా
- అనర్హులకు పథకాలు అందకుండా చూడాలి
- ప్రభుత్వ పథకాలకు పూర్తి బాధ్యత మీదే
- ప్రజల్లోకి వాటిని సక్రమంగా తీసుకు వెళ్లాలి
- గ్రామసభలు నిర్వహించి పక్కగా అమలు చేయాలి
- కలెక్టర్ల సదస్సులో సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

పేదల సంక్షేమం.. రాష్ట్ర అభివృద్ధి మా ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివి. ప్రజా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందనే నమ్మకం, విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత మీపైనే ఉంది. మీరే ప్రభుత్వానికి అసలైన ప్రతినిధులు. మీ నిర్ణయాత్మక పాత్రతోనే ప్రభుత్వానికి మంచి పేరు ప్రఖ్యాతులు వస్తాయి. మీరు ఎప్పటికప్పుడు పనితీరును మెరుగుపరుచుకోవాలి. కొంతమంది కలెక్టర్లు ఇప్పటికీ ఆఫీసుల్లోనే కూర్చొని పని చేయాలనుకుంటున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లాలని గతంలో చెప్పినా కూడా వెళ్లడం లేదు. ఆ తీరు మార్చుకోండి.

\- సీఎం రేవంత్




**ఆదివాసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి చర్యలుప్రత్యేకంగా స్టడీ సర్కిల్, మౌలిక సదుపాయాల కల్పన ఆదివాసీల మాతృభాషలో విద్యకు అధ్యయనం ఆదివాసీలపై ఉద్యమ కేసులు తొలగించేందుకు చర్యలు ఆదివాసీ సంఘాల నేతలో సమావేశంలో సిఎం నిర్ణయం**





## మేము మళ్లీ తిరిగి వస్తున్నాం..

తిరిగి బిజెపిలో చేరిన మాజీ సిఎం రఘువరదాస్



## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

ఫార్ములా రేస్ కేసులో నిధులు ఎందుకు బదలాయించారు

700 కోట్లు ఎ క్కడ లాభాలు వచ్చాయో కెటిఆర్ చెప్పగలడా

కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు

## నెక్నాంపూర్ చెరువులో ఆక్రమణల కూల్చివేత

### అక్రమ కట్టడాలను కూల్చేసిన హైడ్రా



**హైదరాబాద్:**నగరంలోని మణికొండలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన నాలుగు విల్లాలను నేలమట్టం చేసిన హైడ్రా సిబ్బంది.. మరికొన్ని విల్లాలను కూల్చివేయడానికి సన్నద్ధమయ్యారు. అయితే నెక్నాంపూర్ చెరువును కబ్జా చేయడంతో గతంలో రెవన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. మూడు సార్లు కూల్చివేసినా మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు కూల్చివేతలు సాగుతున్నాయి. అలాగే విల్లాలను నిర్మించిన బిల్డర్లపైన హైడ్రా కేసు నమోదు చేసింది. నెక్నాంపూర్ చెరువుపై అక్రమంగా నిర్మించిన దాదాపు 10కి పైగా విల్లాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. గతంలో కూల్చివేతలు చేసినప్పటికీ తిరిగి నిర్మాణాలు చేయడంపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చినటువంటి నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఈరోజు కూల్చివేతలను చేపట్టింది హైడ్రా. దాదాపు నాలుగు విల్లాలను కూల్చివేసిన అధికారులు... మరో పది విల్లాలను కూల్చివేయనున్నట్లు తెలుస్తోంది.

## మీరట్ జిల్లాలో దారుణం

ఒకే కుటుంబానికి చెందిన ఐదురుగురి హత్య

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు హత్యకు గురయ్యారు. భర్త, భార్య, ముగ్గురు కుమార్తెలు దారుణంగా హత్యకు గురైనట్లు పోలీసులు వెల్లడించారు. లిసారి గేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని సోహెల్ గార్డెన్‌లో ఈ విషాద ఘటన జరిగింది. ఇంట్లోనే అయిదుగురి మృతదేహాలను వెలికితీశారు. భర్త మొయిన్, భార్య అస్మా.. మృతదేహాలు ఇంటి ఫ్లోర్‌పై ఉన్నాయి. ఇక ముగ్గరు కుమార్తెల మృతదేహాలు.. ఓ బెడ్‌లో దాచిపెట్టినట్లు గుర్తించారు.



## మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

మారనున్న మెట్రో ముఖచిత్రం



## బస్సు టికెట్ ధరకే విమాన ప్రయాణం

## ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఎసిబి దూకుడు



హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి విచారణ

నిధుల విడుదలకు అనుమతులపై ప్రశ్నలు



## అసెంబ్లీలో చెప్పిన మాటలకే విలువ లేకుంటే ఎలా ?

ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా ప్రత్యేక పరిమితులా

గేమ్‌ఛేంజర్ టిక్కెట్ ధరల పెంపు, షోలపై హరీష్ రావు విమర్శలు

గతంలో మీరు బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వడం వల్లే ఒక మహిళ మృతి చెందారు, మరో పసివాడు ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ పాపం మీ ప్రభుత్వానిదే కదా రేవంత్ రెడ్డి. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ఎందుకు ఈ యూటర్న్?. దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించిన ఆశా కార్యకర్తలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఉద్యమబాట పట్టారు. తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా ఆశా కార్యకర్తల సమస్యలపై శాసనసభలో చర్చించాలని కోరుతూ.. ఈనెల జనవరి 10న ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలు, చేపట్టాలని ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. ఆశాల పట్ల ప్రభుత్వ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. అలాగే వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని ఇంటిని ముట్టడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగభద్రత కోసం పదిహేడేళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

జాబ్‌చార్ట్ లేకుండా నిర్ణీత పనే కాకుండా సర్వేలకు , ఇతర పనులకు వినియోగిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



వేగుచుక్క

# అభివృద్ధి,సంక్షేమం మాకు రెండు కళ్లు




**హైదరాబాద్:** ఈనెల 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పథకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగు పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్ధేశర చేశారు. ఈ మేరకు కలెక్టర్లతో జరుగుతోన్న సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో పర్యటిస్తాను. అన్ని జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తా. సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా చెల్లించాలి. పంట వేసినా.. వేయకపోయినా.. సాగుయోగ్యమైన భూమికి రైతు భరోసా ఇవ్వాలి. అనర్హులకు ఇవ్వొద్దు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అనర్హులను గుర్తించాలన్నారు.. సాగు యోగ్యం కాని భూములను గుర్తించి మినహాయించాలి. స్థిరాస్తి భూములు, లేఅవుట్లు, నాలా కన్వర్షన్, మైనింగ్, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు సేకరించిన భూముల వివరాలను సేకరించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులను క్రోడీకరించుకోవాలి. గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకోవాలి. వాటిపై గ్రామ సభల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని సీఎం వివరించారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెల్లేది కలెక్టర్లేనని అన్నారు. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని తెలిపారు. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం.. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోవైపు.. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు.. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే.. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం.. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని సీఎం కలెక్టర్లకు చెప్పారు. ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు అర్హుల జాబితాను ఇంఛార్జి మినిస్టర్ కు అందించాలని సీఎం చెప్పారు. ఇంఛార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలన్నారు. జనవరి 26న అత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం.. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తున్నదన్న నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలని తెలిపారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండని చెప్పారు. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి.. జనవరి 26 తరువాత తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు ప్రధాన పథకాలను ఈనెల 26వ తేదీ నుండి అమలుచేయాలని నిర్ణయించామన్నారు. భారీ వ్యయంతో కూడుకున్నప్పటికీ.. రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలన్న భావనతో విస్తృతంగా చర్చించిన మీదటే.. ఈ పథకాలను అమలు చేయాలనే నిర్ణయం తీసుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే.. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశామని.. ఈ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీల భాగస్వామ్యం తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికను, ప్రతీ ఉమ్మడి జిల్లాలో ఇంఛార్జి మంత్రులు ఇందిరమ్మ కమిటీలతో చర్చించిన మీదటే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం నిర్ణయించే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల వివరాలను ప్రతీ గ్రామంలో ఫ్లెక్సీల ద్వారా ప్రకటించాలని అన్నారు. ఇప్పటికే, రాష్ట్రంలో రూ.22000 కోట్ల రైతు రుణ మాఫీలను చేశాం.. ఈ వివరాలను కూడా ప్రతీ గ్రామంలో ప్రకటించాలని తెలిపారు. ఈ నాలుగు పథకాలను సంబంధించి సవివరమైన మార్గ దర్శకులతో ఉత్తర్వులు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా లబ్దిదారులను ఎంపిక చేయాలి.. ఈ పథకాలపై జిల్లాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు.

# ఐదేళ్లలో చేయలేని పనులు.. ఆరు నెల్లలో చేసి చూపాం



**కాకినాడ:** తనకు పని చేయడం తప్ప విజయం గురించి తెలియదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. అటువంటి తనకు పిఠాపురం ప్రజలు ఘన విజయం ఇచ్చారని.. తన గాయాలకి పిఠాపురం ప్రజలు మందు వేశారని కొనియాడారు. జన్మంతా పిఠాపురం ప్రజలకి రుణపడి ఉంటానని తెలిపారు. పిఠాపురం పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'మీ బలం వలన రెండు లక్షల 8 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. నా గెలుపు ఆంధ్ర ఆత్మ గౌరవం. రాష్ట్రంలో మౌళిక సదుపాయాలు అభివృద్ధి కావాలి. తిరుమలలో జరిగిన ఘటన బాధ కలిగించింది. సంక్రాంతి కి పిఠాపురంలో ఊరంతా పందిరి వేద్దాం అనుకున్నాను.. కానీ తిరుమల ఘటనతో తగ్గించి చేస్తున్నాను. కుదిరితే దసరా బాగా చేసుకుందాం.' అని డిప్యూటీ సీఎం తెలిపారు. 'ఓట్లు కోసం బుగ్గలు నిమరడం, తల కాయలు నిమరడం కాదు. మీరు పిఠాపురం గెలిపించిన వ్యక్తి గిరిజనులకి రోడ్లు వేయించడానికి పని చేస్తున్నాడు. మనసు మానవ సహజం..రాజకీయాల్లో ఎవరు పెట్టుకోరు. అన్నమయ్య జిల్లాలో గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు దాడి చేశారు. ఏపీ ప్రభుత్వం జీతాలతో బతికిన కుటుంబం నాది.. ఆ రుణం తీర్చుకోవాలి. మా నాన్న మీద దాడి జరిగితే ఎలా స్పందిస్తారో అలా స్పందించాను. 414 గ్రామాలు ప్రజలు డోలిలతో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం వేల కోట్లు దుర్వినియోగం చేసింది. ఓట్లు కోసం కాదు.. నాకు లెక్కలు లేవు.' అని పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ గుర్రం జాషువా కవిత చదివి వినిపించారు. గత ప్రభుత్వాన్నీ నడిపిన పెద్ద మనుషులకు ఈ ఆరు నెలలు పాలన పట్ల తృప్తి లేదట.. గత ప్రభుత్వం డైరీలను చంపేశారని తెలిపారు. ఏడీబీ రోడ్డును గత ప్రభుత్వం ఐదేళ్లు వదిలేసిందని.. గత ప్రభుత్వం స్కామ్ లలో రికార్డు సృష్టించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అభివృద్ధిలో రికార్డు సృష్టించిందని వెల్లడించారు. పిఠాపురం మండలం కుమారపురంలో కృష్ణుడి ఆలయం వద్ద నిర్మించిన మినీ గోకులంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 12,500 మినీ గోకులం షెడ్లను ఇక్కడి నుంచి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కూటమి విజయం అంటే.. ప్రజలు, రాష్ట్రం ఉమ్మడి గెలుపు అని ఈ సందర్భంగా సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. దేశం రుణం తీర్చుకోవాలని ఈ సందర్భంగా యువతకు ఆయన పిలుపు నిచ్చారు. పల్ఎలె రుణం తీర్చుకోవాలన్నది తన కోరిక అని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అయితే గ్రామాల్లో విధులు నిర్వహించే క్రమంలో మరింత బాధ్యతగా ఉండాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. తాము అండగా ఉంటామని అధికారులకు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. నెలల్లో ఏం చేశారని అడిగిన వారికి చెబుతున్నానంటూ .. తాము ఈ కాలంలో 12,500 గోకులాలు నిర్మించామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసిందన్నారు. భవిష్యత్తులో మరో 20 వేల గోకులాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. గత ప్రభుత్వం అమూల్‌ను తీసుకొచ్చి.. ప్రభుత్వ డెయిరీలను చంపేసిందని మండిపడ్డారు. గత జగన్ ప్రభుత్వం గోకులాలపై సైతం దృష్టి పెట్టలేదన్నారు. అయితే గోవులు, గోకులాలను సంరక్షించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు నిచ్చారు. మరోవైపు.. ఈ ఆరు నెలల్లో కూమిటి ప్రభుత్వం ఏమి చేసిందంటూ వైసీపీ అగ్రనేతలు పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విధంగా సమాధానమిచ్చారు.

## మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్ మారనున్న మెట్రో ముఖచిత్రం

**హైదరాబాద్** : గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ను అనుసంధానం చేస్తూ 36 వరకు రోడ్డు మార్గాలు, నాలుగు చోట్ల రైలు మార్గాలు ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాలతో పాటు మెట్రో మార్గం కలిస్తే భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి. ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర హైదరాబాద్ వైపు రెండు మెట్రో కారిడార్లు, దక్షిణ హైదరాబాద్ వైపు మరో కారిడార్‌కు డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మెట్రోరైలు సౌకర్యం ఔటర్ రింగు రోడ్డును దాటి నగర శివారు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశలోని జేబీఎస్ నుంచి ఎంబీజీఎస్ మార్గంలో 11 కిలోమీటర్లు ప్రస్తుతం నగరవాసులకు అందుబాటులో ఉంది. రెండో దశలో చేపట్టబోయే జేబీఎస–శామీర్‌పేట (22 కి.మీ), ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ), చాంద్రాయణ గుట్ట నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్, శంషాబాద్ టౌన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు (35 కి.మీ), అదేవిధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) వరకు (40 కి.మీ).. ఇలా మొత్తం 115 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉత్తర దిక్కున ఉన్న శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డు నుంచి దక్షిణ దిక్కున ఉన్న ఫోర్త్ సిటీతో అనుసంధానం అవుతుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఉత్తరాన ఉన్న శామీర్‌పేట నుంచి సికింద్రాబాద్, ముషీరాబాద్, ఎంజీబీఎస్, చార్మినార్ మీదుగా చాంద్రాయణగుట్ట, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుంచి ఫోర్త్ సిటీ వరకు మెగా మెట్రో కారిడార్ అవతరించనుంది. హైదరాబాద్ మహానగరంలో ఉత్తర–దక్షిణ దిక్కులను కలిపే మెగా మెట్రో కారిడార్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్ స్టేషన్‌లు, ఎంఎంటీఎస్, ఎక్స్‌ప్రెస్ రైళు రాకపోకలు సాగించే సికింద్రాబాద్, ఫలక్‌నుమా, బుద్వేల్, శంషాబాద్, అల్వాల్, బొల్లారం వంటి రైల్వే స్టేషన్‌లతో అనుసంధానం అవుతుంది. ఇక అత్యంత కీలకమైంది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విమానాల నెట్‌వర్క్ కలిగిన విమానాశ్రయంతో కూడా ఈ మెట్రో కారిడార్ కలిస్తే అన్ని రకాల ప్రజా రవాణా వ్యవస్థలు ఒకే మార్గంలో ఉండనున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న ప్రాంతాలను కలపడమే కాకుండా నివాస, వ్యాపార వాణిజ్య కేంద్రాలను, ఔటర్ రింగు రోడ్డు ఇంటర్‌చేంజ్ కేంద్రాలను కలిపేలా మెగా మెట్రో మార్గం అందుబాటుకి వస్తే హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థ ముఖ చిత్రం సమూలంగా మారిపోనుంది.

## బస్సు టికెట్ ధరకే విమాన ప్రయాణం

**హైదరాబాద్ :** సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రైవేట్ ట్రావెల్స్‌లో సీట్లు దొరికినా భారీ రేట్లతో జేబులు గుల్లయ్యే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా రైళ్లు, బస్సుల్లో ప్రయాణానికి సుమారు 10నుంచి 14 గంటల సమయం పడుతుండడంతో కొందరు విమానాలవైపు దృష్టి సారిస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉన్న 10,11,12 తేదీల్లో కాకుండా 13వ తేదీన వెళ్లే వారు 1–2 గంటల వ్యవధిలోనే తమ ఊళ్లకు ప్రయాణించేలా విమానయానాన్ని ఎంచుకుంటున్నారు. 13వ తేదీన హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లాలంటే విమానపు టికెట్లు రూ.5వేల నుంచి అందుబాటులో ఉన్నాయి. అయితే, ఒకరోజు ముందు (12వ తేదీన) ఏసీ స్లీపర్ బస్సుల్లో వెళ్లాలంటే రూ.6 వేల నుంచి 7వేల దాకా డబ్బు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంటోంది. సీటును బట్టి రేట్లను నిర్ణయిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు సంక్రాంతి డిమాండును సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా వైజాగ్ ఒక్కటే కాదు.. రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, బెంగళూరు వంటి ప్రాంతాలకు సైతం ఆయా వెబ్‌సైట్‌లలో ఫ్లైట్ టికెట్ల ధరలు తక్కువగా కనిపిస్తున్నాయి. పండగకు వెళ్లేవారు సరిగ్గా ప్లాన్ చేసుకుంటే ఏసీ స్లీపర్ బస్సుకు వెచ్చించే చార్జీలతోనే విమానంలో ప్రయాణం చేయవచ్చని ట్రావెలింగ్ నిపుణులు సూచిస్తున్నారు.

## ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఎసిబి దూకుడు

**హైదరాబాద్:** ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏసీబీ విచారణ కొనసాగింది. శుక్రవారం దాదాపు 6 గంటలుగా బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ రికార్డులను పరిశీలించిన ఏసీబీ అధికారులు వాటిని బీఎన్ఎల్ రెడ్డి ముందు ఉంచి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. హెచ్ఎండీఏ బోర్డు ఖాతా నుంచి ఎఫ్ఈవోకు రూ.55 కోట్లు రిలీజ్ చేయడంలో బీఎల్ఎన్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. ఈ మేరకు నేడు విచారణ చేపట్టింది. అయితే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఆదేశాలతోనే నగదు రిలీజ్ చేసినట్లు విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను ప్రొసీడింగ్స్ అన్ని పూర్తి చేశానని రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తన సొంత ప్రయోజనాలు ఏమీ లేవని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి వివరించినట్లు సమాచారం. ఒకవైపు మంత్రి కేటీఆర్.. మరోవైపు పైఅధికారి ఒత్తిడి వల్లే రూ.55 కోట్లకు సంబంధించి తాను ప్రొసీడింగ్స్ చేసినట్లు బీఎల్ఎల్ రెడ్డి విచారణలో చెప్పారు. నగదు బదిలీ చేస్తే భవిష్యత్తులో ఇరుక్కుపోతామని తనకు ముందే తెలుసని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అయినా అప్పటి పరిస్థితుల వల్లే నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్లాల్సి వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. తాను ఏసీబీ విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈడీ అడిగిన ప్రశ్నలనే మీరూ అడుగుతున్నారని ఏసీబీ అధికారులకు ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఈడీ అడిగిన ప్రశ్నలన్నిటికీ తాను సమాధానం ఇచ్చానని, ఏసీబీ విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది.

# అసెంబ్లీలో చెప్పిన మాటలకే విలువ లేకుంటే ఎలా ?



**హైదరాబాద్:** గేమ్ చేంజర్ సినిమా అదనపు షోలు వేసుకునేందుకు అనుమతి ఇవ్వడంపై హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు హాట్ కామెంట్స్ చేశారు. సీఎం తీరు చూస్తే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందన్నారు. ఇదే అంశంపై ట్విట్టర్ వేదికగా స్పందించిన హరీష్ రావు.. 'ఒక మహిళ మృతి చెందారు. ఇక మీదట సినిమాలకు స్పెషల్ ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి రెడ్డి.. రెండు వారాలు కూడా తిరగకముందే ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా మాట మార్చారు' అంటూ విమర్శలు గుప్పించారు. టికెట్ రేట్లు పెంచేది లేదంటూ అదే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలు సైతం స్వల్ప వ్యవధిలోనే నీటి మూటలు అయ్యాయన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా? అని హరీష్ రావు ప్రకటించారు. అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ టికెట్ రేట్లు, అదనపు షోస్‌కి అనుమతి ఇవ్వడం సభను అవమానించడమేనని అన్నారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ పెడతామని హరీష్ రావు ప్రకటించారు. మాట తప్పం, మడమ తిప్పం అంటూ బీరాలు పలికి ఇప్పుడు టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారు? ఎవరికి లబ్ది చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హరీష్ రావు సూటిగా ప్రకటించారు.'గతంలో మీరు బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వడం వల్లే ఒక మహిళ మృతి చెందారు. మరో పసివాడు ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ పాపం మీ ప్రభుత్వానిదే కదా రేవంత్ రెడ్డి. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ఎందుకు ఈ యూ టర్న్ తీసుకున్నారు. దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి' అని హరీష్ రావు ప్రశ్నించారు.


# మేము మళ్లీ తిరిగి వస్తున్నాం..

**రాంచీ:** మేము తిరిగి వస్తామనే నినాదంతో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ఒడిశా గవర్నర్ రఘువర్ దాస్ తిరిగి బీజేపీలో చేరారు. శుక్రవారం రాంచీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రఘువర్ దాస్ రెండోసారి పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ సభ్యత్వం తీసుకున్న తర్వాత, రఘువర్ దాస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఒడిశా గవర్నర్ పదవికి రాజీనామా చేయడం ద్వారా, ఆయన ఇప్పుడు తన పాత పాత్రకు తిరిగి వస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌గా ఉండటం గౌరవానికి సంబంధించిన విషయమన్నారు. 2024 సంవత్సరం నుంచి పాఠాలు నేర్చుకుంటూ 2025 కొత్త సంవత్సరంలో కొత్త శక్తి, కొత్త ఉత్సాహం, కొత్త ఉత్సాహంతో, అందరూ బీజేపీ కార్యకర్తలు ప్రజా ప్రయోజనాల కోసం పోరాడి విజయం సాధించాలని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జనవరి 10 తనకు చారిత్రాత్మకమైన రోజు అని రఘువర్ దాస్ అన్నారు. 1980లో ఈ రోజున, ఆయన బీజేపీలో ప్రాథమిక సభ్యుడయ్యారు. ఇప్పుడు ఆయన రెండో సారి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారు. తాను గవర్నర్‌గా నియమితుడైనప్పుడు, 2023 అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాను లిసి తన రాజీనామాను సమర్పించినప్పుడు, అది తన జీవితంలో చాలా భావోద్వేగ క్షణం అని ఆయన అన్నారు.

రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములు ఉంటాయని రఘువర్ దాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

గెలుపు, ఓటమి జీవితంలో ఒక భాగమని అన్నారు. 1984లో బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు ప్రతిపక్షాలు 'హమ్ దో హమారే దో' అని ఎగతాళి చేశాయని, ఆ రోజును ప్రజలు చూశారని పేర్కొన్నారు. కానీ మీ అందరికీ తెలుసు, ఇప్పుడు బీజేపీ దేశాన్ని అంతిమ స్థాయికి తీసుకెళ్లే దిశగా కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి అధికారం మనకు ఒక సాధనమని ఆయన అన్నారు. ఈ కారణంగా ప్రధానమంత్రి నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చింది. నేడు, భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశంలోని 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయని రఘువర్ దాస్ తెలిపారు. జార్ఖండ్ ప్రజలు ఇచ్చిన ఆదేశాన్ని తాను గౌరవిస్తున్నానని మాజీ ముఖ్యమంత్రి రఘువర్ దాస్ అన్నారు. జార్ఖండ్ ప్రజలు ఇండియా అలయన్స్ ప్రభుత్వానికి పాలించడానికి మెజారిటీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ఆధారంగా ఇండియా అలయన్స్‌కు ఆధిక్యం లభించిందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని ఆయన అన్నారు. సంకీర్ణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి పార్టీ కొన్ని నెలలు మాత్రమే వేచి చూస్తుందన్నారు. లేకపోతే బీజేపీ వీధుల నుంచి సభ వరకు ప్రజా ప్రయోజన అంశాలపై వాగ్దానాలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబులాల్ మరాండి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్ర రాయ్, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, ఎంపీ మనీష్ జైస్వాల్, రాజ్యసభ ఎంపీ ఆదిత్య సాహు, మాజీ ప్రతిపక్ష నాయకుడు అమర్ బౌరి, ఎమ్మెల్యే సహా అనేక మంది బీజేపీ నేతలు నీరా యాదవ్, అలోక్ చౌరాసియా సహా పలువురు హాజరయ్యారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే



**కరీంనగర్:** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే ఆందోళనలు ఎందుకు చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా అని ప్రశ్నించారు. అందుకోసం ఏమైనా జైలుకు వెళతారా అని నిలదీస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సర్కార్ సొమ్మును అక్రమంగా కట్టబెట్టి పైగా అడ్డగోలుగా మాట్లాడతవా అని కేటీఆర్ పై సీరియస్ అయ్యారు. కేబినెట్ ఆమోదం లేకుండా విదేశీ కంపెనీకి అంత అర్జెంట్‌గా 55 కోట్లు విడుదల చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఫార్ములా ఈ రేస్ తో ప్రభుత్వానికి రూ.700 కోట్లు లాభం వచ్చిందని కేటీఆర్ అంటున్నారు.. మరీ ఆ లాభాలు ఎక్కడ వచ్చాయో చూపించాలని డిమాండ్ చేశారు. లొట్టపీసు సీఎం, లొట్ట పీసు ప్రభుత్వం అని కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నా.. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారు..? ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌ను అడ్డగోలుగా తిడుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని అన్నారు. ఢిల్లీ వెళ్లి కేసీఆర్ కాంగ్రెస్ హై కమాండ్‌కు కప్పం కడుతున్నందుకే రేవంత్ ఏం చేయలేకపోతున్నారా.. అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని.. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై, కేసీఆర్ కుటుంబ అవినీతిపై బీజేపీ రాజీలేని పోరు కొనసాగిస్తోందని ఈ సందర్భంగా బండి సంజయ్ స్పష్టం చేశారు.

వేగుచుక్క

# నలంద"లో ఘనంగా "సంక్రాంతి" సంబరాలు.











**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, జనవరి 10:**

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్ లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా పాఠశాల కరెస్ప%శీ%డెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ పండుగ ప్రాముఖ్యత విద్యార్థులకు వివరించారు. ప్రతి సంవత్సరం సూర్యుడు ధనస్సు రాశి నుండి మకర రాశిలోకి ప్రవేశించడం " ద్వారా మకర సంక్రమణ ప్రారంభ మవుతుంది. ఆనాటి నుంచి వాతవరణంలో మార్పులు సంభవించి "చలి తగ్గు ముఖం పడుతుంది. మకరరాశిలో కి సూర్యుడు ప్రవేశించడాన్ని ఉత్తరాయణం అంటారు. పంటల సమృద్ధిగా పండటంతో అందరు రైతులు సంతోషాలతో ఉండి భోగి, మకర సంక్రాంతి కనుమ పండుగను అందరు నూతన వస్త్రాలంకారణ చేసి పిండివంటలు చేసుకుంటారని వారు వివరించారు. అనంతరం పాఠశాలోని విద్యార్థినిలకు రంగోళీ పోటీలు నిర్వహించారు. పోటీలలో సూమారు 100 వరకు రకరకాల





అందమైన ముగ్గులు చూడ ముచ్చటగా వేశారు. ఈ రంగోలి పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులకు గాలి పటాల పోటీలు నిర్వహించారు. అందులో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టియులో ఈసీ నిర్ణయాలు అమలు చేయడం లేదు.

**పదవి కాలం పూర్తయిన అడ్మినిస్ట్రేటివ్ పదవులు కొనసాగిస్తున్నారు.**

**స్పోర్ట్స్ డబ్బులు ఏమయ్యాయో లెక్క తేల్చాలి.**

**పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 10:**

తెలంగాణ యూనివర్సిటీలో ఈసీ నిర్ణయాలు ఎందుకు అమలు చేయడం లేదని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రశ్నించారు. శుక్రవారం నగరంలో ఎర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజేశ్వర్ మాట్లాడారు. అధికారికంగా చేసిన ఈసీ నిర్ణయాలను అమలు ఎందుకు జరపడం లేదని, విద్యార్థి సంఘాలు కొట్లాడి అవినీతి అధికారులను వెనక్కి నెట్టితే ఇప్పుడు




వచ్చినవాళ్లు వారిపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు కట్టిన డబ్బుల్ని అవినీతి చేసిన అధికారుల నుంచి ఎందుకు రికవరీ చేయడం లేదని ప్రశ్నించారు. కెసిఆర్ ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటువంటి తేడా లేదని, విద్యార్థులకు మేలు జరిగే నిర్ణయాలు ఇప్పటి వరకు ఏం తీసుకున్నరని అన్నారు.

అడ్మిన్ పదవుల కాలం పూర్తయిన ఇంక ఎందుకు కొనసాగిస్తున్నారని, నిబంధనాలకు విరుద్ధంగా ఉన్న, వివాదస్పదంగా ఉన్న విషయాల్లో మాత్రం యూనివర్సిటీ అధికారులు దొడ్డి దారిన తాత్కాలిక పాలక మండలి పేరుతో నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తుందని అన్నారు. యూనివర్సిటీ విద్యార్థులకు కావాల్సిన ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం కానీ, మౌలిక వసతుల కల్పన విషయంలో కానీ నిర్ణయాలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. గత పాలక మండలి నిర్ణయాల అమలు, విద్యార్థుల శ్రేయస్సు కోరే నిర్ణయాలు చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు దేవిక, సాయి కిరణ్, ముక్త శ్రీ , మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 10**

వైకుంఠ ఏకాదశి / ముక్కోటి ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, తెలుగు ప్రజలందరు భక్తి, శ్రద్దలతో పవిత్రంగా ఈ వైకుంఠ ఏకాదశి పండుగను జరుపుకుంటారని అన్నారు. మహావిష్ణుమూర్తి స్వయంగా గరుడ వాహనదారుడై ముక్కోటి దేవతలతో కలిసి భూలోకనికి వచ్చి దర్శనం ఇస్తాడనేది ప్రజల విశ్వసం అన్నారు. మహాభారత యుద్ధంలో శ్రీ కృష్ణుడు, అర్జునునికి గీత బోధించిన రోజుగా కూడా భావిస్తారని అన్నారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమైన పవిత్రతను సంతరించుకున్నందున దీనిని ముక్కోటి ఏకాదశిగా జరుపుకుంటారన్నారు. ముక్కోటి దేవతల ఆశీర్వాదం తెలుగు రాష్ట్రాల ప్రజలపై ఉండాలని ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో సంతోషంగా ఉండేలా ఆశీర్వదించాలని ఆ



శ్రీవారిని వేడుకున్నట్లు తెలుపుతు తెలుగు రాష్ట్రాల ప్రజలందరికి వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్కిడ్స్" హైస్కూల్ లో సంక్రాంతి సంబరాలు.

**ఆటపాటలతో అలరించిన విద్యార్థులు.**

**పండుగ విశిష్టతను వివరించిన పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 10:**

జిల్లాకేంద్రంలోని ఆర్కిడ్స్ హైస్కూల్ లో సంక్రాంత్రి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థులు అలరించారు. విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేసి సంబరాల్లో పాల్గొన్నారు.



ఈ వేడుకలలో విద్యార్థులు హరిదాసు వేషధారణలో, వివిధ రకాల సాంస్కృతిక దుస్తులతో అందరిని ఆకర్షించారు. బొమ్మల కొలువుతో పాటు, ఈ ముగ్గుల పోటీలో విద్యార్థినిలు రంగురంగుల ముగ్గులతో పాటుగా హరిదాసు, గంగిరెద్దుల బొమ్మలను ముగ్గులతో వేసి, ఆ బొమ్మలను గొబ్బెమ్మలతో అలంకరించి అందరిని అబ్బుర పరిచారు.





కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం, ప్రతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేస్తు వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి తో పాటు, ఆర్కే గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సి.ఈ.వో. యం. జైపాల్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ యం. సదాశివరెడ్డి, వైస్. ప్రిన్సిపాల్ భూలక్ష్మి , ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



# ఆ భూములకు కూడా రైతు భరోసా..

తెలంగాణలో అన్నదాతలకు రైతు భరోసా కింద.. ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి సాయం అందించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమైంది. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల హామీలతో పాటు రైతు భరోసా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. అయితే.. ఈ సమావేశంలో రైతు భరోసా గురించి కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు.

తెలంగాణ రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన రైతు భరోసా పథకం అమలుకు రేవంత్ రెడ్డి సర్కార్ ముహూర్తం ఖరారు చేసిన విషయం తెలిసిందే. జనవరి 26వ తేదీన రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ హామీలను కూడా అమలు చేయేనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే ప్రకటించారు. కాగా.. ఈరోజు (జనవరి 10న) సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీపై కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేసినట్టు తెలుస్తోంది.

ఈ క్రమంలోనే రైతు భరోసా అమలుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతు పంట వేసినా.. వేయకున్నా.. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరానికి రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతి మండలంలోని ఎమ్మార్వో, ఏఈవో.. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో భాగస్వాములుగా ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా చెల్లించాలని తెలిపిన సీఎం రేవంత్.. సాగు అక్కరకు రాని భూములకు మాత్రమే పెట్టుబడి సాయం ఇవ్వకూడదని కలెక్టర్లకు స్పష్టం చేశారు. అలాంటి సాగు యోగ్యంకాని భూములను గుర్తించి రైతు భరోసా నుంచి మినహాయించాలని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు.

రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన భూములు, లే అవుట్ స్థలాలు, నాలా కన్వర్ట్ అయిన భూములు, మైనింగ్ స్థలాలు, గోదాములు నిర్మించిన స్థలాలు, వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలను ముందుగానే సేకరించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులు, సంబంధిత విభాగాల రికార్డులన్నీ క్రోడీకరించుకోవాలన్నారు. వీటితోపాటు విలేజ్ మ్యాప్‌లను పరిశీలించి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి.. ధ్రువీకరించుకోవాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు.

వ్యవసాయ యోగ్యంకాని భూముల జాబితాలను పక్కాగా తయారు చేసి గ్రామ సభల్లో ప్రచురించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆ భూముల గురించి గ్రామ సభల్లో చర్చించి రైతులకు వెల్లడించాలన్నారు. ఎలాంటి అనుమానాలు అపోహలకు తావు లేకుండా రైతు భరోసాను అమలు చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఇదిలా ఉంటే.. సమావేశంలో కలెక్టర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకోవటంపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచినా ఇలాంటి ఘటనలు జరగటం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్లు పర్యవేక్షణ చేయకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణం అవుతున్నాయన్నారు. ఇక నుంచి వారం వారం ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లను కలెక్టర్లు సందర్శించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన

తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు.

తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు.

నల్లగొండ వరంగల్ ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి, కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మల్కా కొమరయ్య, కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజిరెడ్డిని ఎంపిక చేసినట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు.

సరోత్తమ్ రెడ్డి వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి. ప్రధానోపాధ్యాయుడిగా 10 ఏండ్లు, స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా 21 ఏండ్లు పని చేశారు. 2012 నుంచి 2019 దాకా పీఆర్టీయూ జనరల్ సెక్రటరీగా సేవలందించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశారు సరోత్తమ్ రెడ్డి.

పెద్దపల్లికి చెందిన మల్క కొమరయ్య.. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈ పట్టా పుచ్చుకున్నారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లో అనేక విద్యా సంస్థలను నెలకొల్పారు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

మెదక్ జిల్లాలోని రామచంద్రాపురానికి చెందిన సీ అంజిరెడ్డి బీఏ పూర్తి చేశారు. పారిశ్రామికవేత్తగా ఎదిగారు. అంజిరెడ్డి భార్య గోదావరి.. సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. గత రెండు దశాబ్దాల నుంచి ఎస్ఆర్ ట్రస్ట్‌ను అంజిరెడ్డి నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని అందించేందుకు ఎస్ఆర్ ట్రస్ట్ తోడ్పాటును అందిస్తుంది. అంతేకాకుండా పేద విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

# మరో ఎన్నికల సంబురం.. అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల జరిగే అవకాశం ఉండగా.. అంతకుముందే ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుం డగా.. అందులో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కాగా.. ఒకటి పట్టభద్రులు ఎమ్మెల్సీ. అయితే.. ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి.. అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. తెలంగాణ మరో ఎన్నికల సంబురానికి సిద్ధమవుతోంది. రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో పాటు ఒకటి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. కాగా.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు సంసిద్ధమవుతున్నాయి. అయితే.. ఈసారి అన్ని పార్టీల కంటే ముందే.. బీజేపీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే.. ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాల కోసం బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించేసింది. ఈ మేరకు శుక్రవారం (జనవరి 10న) బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి.. ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను విడుదల చేశారు. నల్గొండ- ఖమ్మం- వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సరోత్తం రెడ్డి, కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్కా కొమరయ్యను ప్రకటించగా.. కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ పట్టభద్రుల అభ్యర్థిగా కిషన్ రెడ్డి ప్రకటించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ఆదేశాలతో అభ్యర్థులను ప్రకటించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు.



అయితే... కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీల పదవీకాలం ఈ ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనుండగా.. ఆయా స్థానాల్లో ఎన్నికల కోసం ఇప్పటికే ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండనుందని అంచనాలు వేస్తున్నారు. అయితే.. ఫిబ్రవరిలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీజేపీ అధిష్ఠానం ముందుగానే తమ అభ్యర్థులను ప్రకటించింది. మరోవైపు 12 జిల్లాల నుంచి ఓటు హక్కు కోసం మొత్తం 28 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోగా.. పరిశీలన అనంతరం మొత్తం 22,554 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఫైనల్ చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరూ తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సిందేనని.. గతంలో ఓటు ఉన్నా మరోసారి ఓటు నమోదు చేసుకోవాల్సిందేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేసింది.

# మంత్రి హెచ్చరించినా.. జిజిహెచ్‌లో మారని తీరు.

**రోగులకు వైద్యం అందించడంలో అదే నిర్లక్ష్యం.**

**వైద్యం కోసం వచ్చిన మహిళను ముప్పుతిప్పలు పెట్టిన వైనం.**

**చివరకు ఆందోళనతో దిగివచ్చి వైద్యం అందించారు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 10**



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం వీడటం లేదు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇటీవల వచ్చి హెచ్చరించిన వారి తీరు మారడం లేదు. వైద్యం కోసం వచ్చిన రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇందుకు శుక్రవారం జిజిహెచ్ లో జరిగిన ఘటన నిదర్శనం.లక్ష్మి అనే మహిళా పిట్స్ రావడంతో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి శుక్రవారం మధ్యాహ్నం 1:30 వచ్చి డాక్టర్ కి చూపించగా, సిటీ స్కానింగ్ కు రాశారు. రోగి తాలూకు వారు ప్రభుత్వ హాస్పిటల్ లో స్కానింగ్ దగ్గరికి వెళ్తే అక్కడ వాళ్ళు పని చేయడం లేదని, 2 గంటలకు పైగ కూర్చోబెట్టిన తరువాత బయట ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్ళమని చెప్పారు. డబ్బులు పెట్టె స్తోమత లేని రోగి తాలూకు వారు హాస్పిటల్ లో 4 గంటలవరకు అక్కడే ఉండగా, డాక్టర్, సిబ్బంది రోగిని బయకు తీసుకెళ్లండి పిచ్చి, పిచ్చిగా చేస్తుంది అని బయటకు పంపించారు.సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు రోగి తనతో ఆమె ఇద్దరు చిన్న పిల్లలు బిక్కు, బిక్కుమంటు చలి కాలం, దోమల్లో అక్కడే పడి ఉన్నారు. ఆ సమయంలో కూడా రోగికి పిట్స్ వస్తూనే ఉన్నాయి. హాస్పిటల్ లోకి మళ్ళీ తీసుకెళ్దాం అన్న ఆమె నడవలేని పరిస్థితి, స్ట్రేచర్ లేదు, హాస్పిటల్ బాయ్స్ లేరు. రాత్రి 11 గంటల తరువాత రోగి తాలూకు బంధువులు కొంత మంది ఆమెను భుజాలపై వేసుకొని హాస్పిటల్ లోకి వచ్చి, హాస్పిటల్ లో దర్నకు దిగి సూపరింటెండెంట్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనితో పోలీస్, హాస్పిటల్ సిబ్బంది వచ్చి నచ్చజెప్పి ఆమెకు ట్రీట్మెంట్ అందించారు.





# అకౌంట్లో డబ్బులు పడగానే బ్యాలెన్స్ చెక్ చేస్తున్నారా..

టెక్నాలజీ పెరిగినకొద్దీ రోజురోజుకూ సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. ఇక బ్యాంక్ అకౌంట్లు మొత్తం ఫోన్ నుంచే మనం చూసుకుంటూ ఉంటున్నాం. బ్యాంకుకు వెళ్లకుండానే అరచేతిలో ఉన్న సెల్‌ఫోన్ నుంచి లక్షల రూపాయలను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉంటాం. అయితే రోజుకో స్కామ్‌తో సైబర్ నేరగాళ్లు.. అమాయకుల ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా జంప్‌డ్ డిపాజిట్ స్కామ్‌తో అనేక మంది మోసపోయి.. డబ్బులు పోగొట్టుకుంటున్నారు. మొదట మన అకౌంట్లో డబ్బులు డిపాజిట్ చేసి.. ఆ తర్వాత ఖాతాను మొత్తం ఊడ్చేస్తారు.

ఎవరో తెలియని వ్యక్తి నుంచి మన అకౌంట్లో డబ్బులు పడతాయి. ఆ మెసేజ్ చూసి మనం అవాక్కవుతాం. వెంటనే ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం లేదా బ్యాంక్ యాప్స్ ఓపెన్ చేసి.. మన అకౌంట్లో బ్యాలెన్స్ చెక్ చేస్తాం. అకౌంట్ బ్యాలెన్స్ చెక్ చేసేందుకు పిన్ నంబర్ ఎంటర్ చేయగానే అసలు ట్విస్ట్ మొదలవుతుంది. అప్పటివరకు మన అకౌంట్లో ఉన్న డబ్బు మొత్తం ఖాళీ అవుతుంది. ఇదే జంప్‌డ్ డిపాజిట్ స్కామ్. అయితే ఇలాంటి సైబర్ నేరాలు ఎక్కువ అవుతుండటంతో.. సైబర్ నిపుణులు, పోలీసులు, ప్రముఖులు ఇలాంటి స్కామ్‌ల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తాజాగా టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్.. ఈ జంప్‌డ్ డిపాజిట్ స్కామ్ గురించి అవగాహన కల్పించే ఒక వీడియోను షేర్ చేశారు.

సాధారణంగా మన బ్యాంక్ అకౌంట్లో డబ్బులు పడినా, విత్ డ్రా చేసినా ఆ అకౌంట్‌కు లింక్ అయిన సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. ఇలా ఎవరైనా తెలియని నంబర్ల నుంచి మనకు డబ్బులు పడితే.. అవి ఎవరు వేశారు అనే ఆత్రుతతో మనం వెంటనే బ్యాంక్ ఖాతాలో బ్యాలెన్స్ చెక్ చేస్తూ ఉంటాం. అయితే ఇదే ఎరగా వేసి సైబర్ నేరగాళ్లు మరో కొత్త పన్నాగం పన్నుతున్నారు. ఇలా తెలియనివారి ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ చేసి.. ఆ తర్వాత వారి అకౌంట్లో ఉన్న డబ్బు మొత్తాన్ని కొట్టేసే సరికొత్త రకమైన మోసం వెలుగులోకి వచ్చింది.

దీనిపై తాజాగా టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ చేసిన ట్వీట్ తెగ వైరల్ అవుతోంది. ఎవరో తెలియని అజ్ఞాత వ్యక్తుల యూపీఐ వ్యాలెట్ నుంచి మన బ్యాంకు ఖాతాలోకి డబ్బులు వస్తే తెగ సంబరపడిపోకండి అంటూ ఆయన సూచించారు. ఖాతాలో డబ్బులు పడ్డాయనే సంతోషంతో బ్యాలెన్స్ చెక్ చేసేందుకు పిన్ నంబర్ ఎంటర్ చేశారో.. మీ ఖాతా గుల్ల అవుతుందని పేర్కొన్నారు. బ్యాలెన్స్ చెక్ చేసే సమయంలోనే యూపీఐ ఐడీలకు పేమెంట్స్ లింక్‌లను పంపించి సైబర్ నేరగాళ్లు డబ్బులు దోచేస్తున్నారని సజ్జనార్ వివరించారు. ఇలాంటి ఫేక్ పేమెంట్స్ లింక్‌లు వస్తే వాటికి అస్సలు స్పందించొద్దని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఎవరైనా తెలియక సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి సైబర్ ఫిర్యాదులు చేయాలని హితవు పలికారు.

# మణికొండ నెక్నాంపూర్‌లో ఆక్రమణల కూల్చివేతలు

నగరంలో మళ్లీ హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఆక్రమణల కూల్చివేతల్లో భాగంగా మణికొండకు చేరుకుని భారీ భవంతులను కూల్చివేశారు. నెక్నాంపూర్ చెరువును ఆక్రమించి జరిపిన నిర్మాణాలను పడగొట్టారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేతలు జరుపుతున్నారు. ఇక అక్కడ ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగరంలో మళ్లీ హైడ్రా యాక్షన్‌లోకి దిగింది.

అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేతలు చేస్తోంది. చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి.. భారీ భవనాలు నిర్మించగా.. వాటన్నింటిని భారీ యంత్రాలతో నేలమట్టం చేస్తోంది. రాష్ట్రంలో చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ - హైడ్రా అధికారులు.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి భరతం పడుతున్నారు. ఇక ఇటీవలె హైడ్రాకు ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లోని బీ-బ్లాక్ కేంద్రంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తూ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తాజాగా మణికొండలోని నెక్నాంపూర్ చెరువును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని హైడ్రా అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే శుక్రవారం మణికొండలోని నెక్నాంపూర్ చెరువును కబ్జా చేసి.. కట్టిన కట్టడాలను కూల్చివేస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇచ్చిన ఆదేశాలతో ఈ కూల్చివేతలు జరుగుతున్నాయి.

భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. నెక్నాంపూర్ చెరువు బఫర్‌జోన్‌లో భారీ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. అయితే నెక్నాంపూర్ వాసులు.. అక్కడి అక్రమ నిర్మాణాల విషయాన్ని హైడ్రా అధికారుల దృష్టికి తీసుకురావడంతో.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే స్పందించి విచారణ చేపట్టారు. అందులో కొన్ని అక్రమ నిర్మాణాలుగా తేలడంతో కూల్చివేతలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో డీఆర్ఎఫ్ సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు.

ఈ హైడ్రా పోలీస్ స్టేషన్‌కు ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. ఓఆర్ఆర్‌లోని పరిధి.. దానికి అనుబంధంగా ఉన్న మున్సిపాలిటీలు కూడా ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

ఈ హైడ్రా పోలీస్ స్టేషన్ సిబ్బంది, అధికారులు డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమితులవుతారని వెల్లడించింది. జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ హైడ్రా పోలీస్ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఏవీ రంగనాథ్ చర్యలు తీసుకుంటున్నారు.

# అదనపు షోలపై.. రేవంత్ సర్కారుకు హైకోర్టు కీలక ఆదేశాలు

తెలంగాణలో గేమ్ ఛేంజర్ సినిమాకు టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోలకు అనుమతివ్వటంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో ప్రభుత్వానికి పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడం ఏంటని హైకోర్టు ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటిగంట దాటిన తర్వాత షోలకు అనుమతి ఇవ్వడంపై పునఃసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించారు.



తెలంగాణలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరల పెంపు, అదనపు షోలపై హైకోర్టులో విచారణ జరిగింది. గేమ్ ఛేంజర్ సినిమాకు ప్రత్యేక ప్రదర్శనలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుమతి ఇవ్వటంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామని ప్రకటించిన తర్వాత.. ఇప్పుడు ప్రత్యేక షోలకు అనుమతులు ఇవ్వటం ఏంటని హైకోర్టు ప్రశ్నించింది. తెల్లవారుజామున షోలకు అనుమతిపై పునసమీక్షించాలంటూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తాను హైకోర్టు ఆదేశించింది. భారీ బడ్జెట్‌తో తీసి నిర్మాతలు ప్రేక్షకుల నుంచి డబ్బును వసూలు చేయాలనుకోవడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. గొర్ల భరత్ రాజ్ అనే యువకుడు.. జనవరి 10వ తేదీన ఉదయం 4.30 గంటలకు సినిమా ప్రదర్శనకు అనుమతివ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కాగా.. ఈ పిటిషన్ మీద జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో.. సినిమాటోగ్రఫి చట్టాన్ని ఉల్లంఘిస్తూ టికెట్ల ధరల పెంపు, అదనపు షోలకు హోంశాఖ అనుమతి ఇస్తోందంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. 2021లో జారీ అయిన జీఓ ప్రకారమే టికెట్ల ధరలు ఉండాలి.. కానీ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జారీ చేసిన మెమో ఆధారంగా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు న్యాయవాది తెలిపారు. పెంచిన టికెట్ ధరలు ఈ నెల 19వ తేదీ వరకే ఉంటాయని హోంశాఖ జీపీ కోర్టుకు వివరించారు. ఈ విచారణ సందర్భంగా.. పుష్ప-2 చిత్రానికి కూడా టికెట్ల ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇచ్చారని, బెనిఫిట్ షో వల్ల చోటు చేసుకున్న ప్రమాదాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు గుర్తుచేశారు. ఈ ఘటన తర్వాత.. బెనిఫిట్ షోలను అనుమతించేది లేదని ప్రభుత్వం ప్రకటించినా.. స్పెషల్ షోలకు మాత్రం ఉత్తర్వులిస్తున్నారని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో.. స్పెషల్ షోలకు ఉత్తర్వులివ్వటమంటే.. బెనిఫిట్ షోకు అనుమతించటం లాంటిదేనని ధర్మాసం అభిప్రాయపడింది. అర్ధరాత్రి వేళ షోలకు అనుమతిస్తే ఇంటికి వచ్చే సరికి ఎంత సమయం అవుతుందని హైకోర్టు ప్రశ్నించింది. అభివృద్ధి అంటే అర్ధరాత్రి తర్వాత బయట తిరగడం కాదని.. సమయానికి నిద్రపోవడం కూడా ముఖ్యమే కదా అంటూ చురకలంటించింది. ప్రేక్షకుల భద్రతనూ దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలని ధర్మాసనం కీలక సూచనలు చేసింది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది.

జనవరి 10వ తేదీన మల్టీప్లెక్స్‌లలో ఒక్కో టికెట్పై అదనంగా రూ.150, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్పై అదనంగా రూ. 100 చొప్పున పెంచుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. జనవరి 11 నుంచి రోజూ 5 షోల నిర్వహణకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ నెల 11 నుంచి 19 వరకూ మల్టీప్లెక్సుల్లో టికెట్పై అదనంగా రూ. 100, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ అదనంగా రూ. 50 చొప్పున ధరలు పెంచుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.